క్లుప్తంగా

తాగునీరు అందించడంలో విఫలం



హమాలీవాడలో ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల తలాపునే గోదావరి నది ఉన్నా, తాగునీటిని అందించడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని 15వ వార్డు హమాలీవాడ, అర్కలవాడలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించకుంటే ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పి ప్రజలను ఎమ్మెల్యే మోసం చేశారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, ఆకుల సంతోశ్, పానుగంటి మధు, పట్టి వెంకటకృష్ణ, పూదరి రమేశ్, సాతిని రాజు, అన్వేష్, కుచాడి సతీశ్, బోయిని దేవేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం తనిఖీ



హాజరును పరిశీలిస్తున్న రాహుల్

మంచిర్యాలటౌన్: అదనపు కలెక్టర్ రాహుల్ శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించి, విధులకు సకాలంలో హాజరుకావాలని సూచించారు. మున్సిపల్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్షను నిర్వహించి, సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఇంజనీర్ మధుకర్, ఏఈ రాజేందర్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

పాతమంచిర్యాల: అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో డీఈవో యాదయ్యను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాలల్లోనే బుక్స్, యూనిఫాంలు విక్రయిస్తున్నారన్నారు. దళిత బహుజన ఐక్యవేదిక జిల్లా కోఆర్డినేటర్ పలిగిరి కనకరాజు, కిరణ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంచిర్యాల డివిజన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో రాంమూర్తి మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, హెచ్‌ఏవో లక్ష్మణస్వామి, వైద్యుడు సతీశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి చుట్టుపక్కల ఉన్న మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 132/33కేవీ బెల్లంపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా బెల్లంపల్లి మున్సిపాలిటీ తోపాటు బెల్లంపల్లి రూరల్, తాండూర్, భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల పరిధిలో గల గ్రామాలకు ఉదయం 7 నుంచి ఉదయం 10 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

శ్రీరాంపూర్: వేసవిలో కార్మికుల క్వార్టర్లకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి నాయకులు సివిల్ అధికారులను కోరారు. శుక్రవారం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, చర్చల కమిటీ నాయకులు వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్‌లు సివిల్ కార్యాలయంలో సివిల్ ఈఈ గుండె రావును కలిసి మాట్లాడారు. ఎండాకాలంలో జాప్యం చేయకుండా తాగునీరు అందించాలన్నారు. సివిల్ డిపార్టుమెంట్‌లో పని చేసే ఉద్యోగులపై పని భారం తగ్గించాలన్నారు. యూనియన్ పిట్ సెక్రెటరీ పేగ మల్లేశ్ ఉన్నారు.

తీరనున్న వైద్యకష్టాలు

- భీమారం, కన్నెపల్లిలో పీహెచ్‌సీలు
- మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



భీమారంలో పీహెచ్‌సీ ఏర్పాటు కానున్న ఆరోగ్య ఉపకేంద్రం భవనం

భీమారం: మంచిర్యాల జిల్లాలో కొత్తగా ఏర్పడ్డ భీమారం, కన్నెపల్లి మండలాలకు పీహెచ్‌సీలు(ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు) మంజూరు చేస్తూ తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రజలు, రోగులు వైద్యం కోసం చెన్నూర్, మంచిర్యాల తదితర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేది. భీమారంలో పీహెచ్‌సీ లేకపోవడంతో మండల ప్రజలు వైద్యం కోసం పక్కా మండలాలు వెళ్తున్నారని, వారు పడుతున్న ఇక్కట్లపై ఈనెల 15న సాక్షిలో 'వైద్యం అందని దైన్యం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. గురువారం రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో భీమారం, కన్నెపల్లికి పీహెచ్‌సీల మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో మండలాల ప్రజలు, రోగుల వైద్య కష్టాలు తీరనున్నాయి. 2016లో భీమారం, కన్నెపల్లిలో కొత్తగా మండలాలు ఏర్పాటు అనంతరం తహసీల్దార్, మండల పరిషత్, వ్యవసాయ, పోలీస్‌స్టేషన్లు ఏర్పాటయ్యాయి. ప్రజలకు వైద్యసేవలందించేందుకు పీహెచ్‌సీల ఏర్పాటు చేయాలని గత ఏడేళ్ల నుంచే డిమాండ్ ఉంది. ప్రతి మండల కేంద్రాల్లో ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు పీహెచ్‌సీలు ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రకటించారు. ఎట్టకేలకు పీహెచ్‌సీలు మంజూరు చేయడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాండూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పుచ్చల సుందరయ్య 38వ వర్ధంతిని మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. మండల కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు నానయ్య, శంకర్, ఐద్వా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: పేదల కోసం నిరంతరం పోరాడిన పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేనివని ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాశ్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, ప్రజాసంఘాల నాయకులు ఎస్వీ నర్సింహారావు, జె.హన్మంతరెడ్డి, పీఎస్ గంగాధరాచారి, బిక్కయ్య, వేముల రాజేశం, కుమారస్వామి పాల్గొన్నారు.

పశువైద్యశాల తనిఖీ



పరిశీలిస్తున్న రమేశ్‌కుమార్

లక్సెట్టిపేట: మండలంలోని పోతపల్లి పశువైద్యశాలను జిల్లా పశువైద్యాధికారి రమేశ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. త్వరలో మొదలయ్యే రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలోని లబ్ధిదారులకు అందించేలా చూడాలన్నారు. పశువైద్యాధికారి శ్వేత, సిబ్బంది అనిల్ ఉన్నారు.

బతుకమ్మ ఆడి వీవోఏల నిరసన



ఏఎంసీ మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళా వీవోఏలు



చెన్నూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళా వీవోఏలు

బెల్లంపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 33వ రోజు చేరింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో ఏడు మండలాల నుంచి తరలివచ్చిన వీవోఏ మహిళలు ఏఎంసీ క్రీడా మైదానంలో బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. తీరొక్క పాటలతో మహిళలు బతుకమ్మ ఆడిపాడారు. పురుషులు వంటావార్పు చేశారు.

చెన్నూర్: స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద వీవోఏలు సమ్మె కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల వీవోఏలు శుక్రవారం చెన్నూర్‌కు తరలివచ్చారు. బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆడి నిరసన తెలిపారు. బతుకమ్మ పాటల రూపంలో ప్రభుత్వానికి వీవోఏల సమస్యలను వినిపించారు. వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కుంటాల కుమార్, వీవోఏల సంఘాల అధ్యక్షులు గౌరీ, జిమిడి సుధాకర్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



తాండూర్: క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు



మందమర్రిరూరల్: క్షీరాభిషేకం చేస్తూ..



భీమారంలో..



దండేపల్లిలో..

వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తూ తెలంగాణ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లావ్యాప్తంగా వీఆర్‌ఏలు..సీఎం కేసీఆర్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకుని సంబురాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు. కోటపల్లి మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు సుధాకర్, జైపూర్ వీఆర్‌ఏల అధ్యక్షులు పొట్ట మల్లేశ్, ఉపాధ్యక్షుడు తిరుపతి, కోశాధికారి ఎండీ.ఆలీ, గౌరవ అధ్యక్షులు మధుకర్, రాములు, రాజమణి, మురళీకృష్ణ, తాండూర్ వీఆర్‌ఏల మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు అంజలి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



నెన్నెలలో..



జైపూర్‌లో..



కోటపల్లిలో..

ఎస్సార్పీ 1 గనిలో రక్షణ చర్యలు చేపట్టాలి

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 1 గనిలో రక్షణ చర్యలు చేపట్టాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, కార్యదర్శి భాగ్యరాజ్ ఓ ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గనిలోని 3బీ సీమ్,32 డీప్ డిస్ట్రిక్ట్‌లో సరైన వెంటిలేషన్ లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తాగే పైపులకే రూఫ్ బోల్టర్ మిషన్ కనెక్షన్ చేయడం వల్ల తాగునీరు కలుషితం అవుతుందని అన్నారు. కోల్‌కట్టర్ కార్మికులపై పనిభారం మోపుతున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు అందుబాటులో వీల్‌చైర్లు

సాక్షి స్పందన



బస్‌స్టేషన్‌లో అందుబాటులో ఉంచిన వీల్‌చైర్లు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల బస్‌స్టేషన్‌లో దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. చెన్నూర్ ప్లాట్‌ఫాం సమీపంలో శుక్రవారం రెండు వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు. ఈనెల 12న 'వీల్‌చైర్లు నిరుపయోగం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కార్గో సర్వీసు కేంద్రం పక్కన చెత్తలో పడేసిన వీల్‌చైర్లు బస్‌స్టేషన్ ఆవరణలోకి మార్చారు.

మానవత్వమా నువ్వెక్కడ..?

- రిటైర్డు కార్మికుడిని ఇంట్లోకి రానీయని కుటుంబికులు



చాపపై పడుకున్న వృద్ధుడు రాజలింగు

బెల్లంపల్లి: ఆరేళ్ల క్రితం గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి కాలుకు దెబ్బ తగిలి నడవలేని స్థితిలో వచ్చిన సింగరేణి రిటైర్డ్ వృద్ధ కార్మికుడిని శుక్రవారం ఇంట్లోకి రానీయలేదు. ఆ వృద్ధుడిని కుటుంబీకులు నిరాకరించిన హృదయ విదాకరమైన ఘటన బెల్లంపల్లిలో జరిగింది. మానవత్వం లేకుండా ఆ వృద్ధుడిని రోడ్డుపై వదిలేసి కర్కశకంగా వ్యవహరించారు. ఇంటి ముందు ఉన్న రోడ్డు పక్కన చాప పర్చుకుని అక్కడ ఉండిపోయాడు. మున్సిపాలిటీలోని కన్నాల బస్తీకి చెందిన నక్క రాజలింగు సింగరేణి కంపెనీలో పనిచేసి కొన్నాళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశాడు. కొన్ని కారణాలతో ఆరేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో తగువులాడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో రాజలింగు కాలుకు దెబ్బ తగిలింది. గాయాన్ని పట్టించుకోకపోవడంతో నడవలేని స్థితికి వచ్చాడు. సింగరేణిలో కార్మికుడిగా పని చేసిన సమయంలో ఏఐటీయూసీ, సీపీఐలో రాజలింగు క్రియాశీలంగా పని చేశాడు. వృద్ధాప్యంలో గాయపడి నడవలేని స్థితిలో రాజలింగు ఉన్నట్లు సమాచారం తెలుసుకుని సీపీఐ శ్రేణులు కొందరు స్థానిక ప్రభుత్వాసుపత్రికి పంపించారు. అక్కడి వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందిన రాజలింగు డిశ్చార్జి అయి అంబులెన్స్‌లో బెల్లంపల్లిలోని తన ఇంటికి వచ్చాడు. కుటుంబీకులు ఇంట్లోకి రానివ్వలేదు.

పారిశుద్ధ్య నిర్వహణపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: పట్టణంలోని 5వ వార్డు, 11వ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య నిర్వహణ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య మాట్లాడుతూ అన్నివార్డుల్లో ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ వీధుల్లో పరిశుభ్రత పాటించాలని కోరారు. అనంతరం వార్డుల్లో తిరుగుతూ అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ ఆకుల వెంకటేశ్, మేనేజర్ శ్రీహరి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి
కోటపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. జనగామ, ఆలుగామ, సుపాక, వెంచపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అనంతరం జనగామ గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీడీవో భాస్కర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన
జన్నారం: కవ్వాల్, దేవునిగూడ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను మండల ప్రత్యేక అధికారి రమేశ్‌కుమార్ పరిశీలించారు. ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో రమేశ్, సర్పంచులు ఉన్నారు.

గనులపై ప్రపంచ పర్యావరణ దినోత్సవం



ఆర్కే 7 గనిపై పతిజ్ఞ చేయిస్తున్న ఏజెంట్ రాముడు

శ్రీరాంపూర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గనులపై శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్కే 7 గనిపై జరిగిన కార్యక్రమంలో ఏజెంట్ మాలోత్ రాముడు, ఉద్యోగులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాలోత్ రాముడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గని రక్షణాధికారి రవిశంకర్, వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్‌రావు, అండర్‌మేనేజర్లు వెంకట్‌రామ్, లక్ష్మణ్, రమేశ్, సుధీర్‌రెడ్డి, సంక్షేమ అధికారి శాంతన్, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ వెంకటి పాల్గొన్నారు.

ఆర్కే 5 గనిపై..
ఆర్కే 5 గనిపై ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్ మాట్లాడుతూ పర్యావరణకు గొడ్డలి పెట్టుగా మారిన కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ఇంధన కాలుష్యం ప్రమాదకరమన్నారు. సిగ్నల్స్ వద్ద వాహనాలను ఆఫ్ చేయాలన్నారు. వ్యక్తిగత వాహనాల స్థానంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, అధికారులు వినయ్‌రెడ్డి, సందీప్, రాందాస్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన
భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో పర్యావరణంపై శుక్రవారం గ్రామ పంచాయతీల్లో అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచులు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విస్తరణ పనులు అడ్డగింత

లక్సెట్టిపేట: 63వ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులను ఇటిక్యాల వద్ద శుక్రవారం పట్టణ వాసులు అడ్డుకున్నారు. అధికారులు సర్వే చేస్తూ గుర్తింపు చిహ్నాలు వేయడంతో వారిని అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. పట్టణంలోని పలు భవనాలు విస్తరణలో కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పనులు ఆపి, బైపాస్ రోడ్డు వేయాలని, సర్వే పనులకు సంబంధించి ఉత్తర్వు కాపీలు చూపించాలన్నారు. దీంతో అధికారులు పనులు నిలిపివేసి తిరిగి వెళ్లిపోయారు. లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల రోడ్డు నిర్వాసితులు పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రోత్సాహం

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు ప్రోత్సాహం అందిస్తోందని నాయీబ్రాహ్మణులు తెలిపారు. వారిని ప్రోత్సాహించేందుకు రూ. లక్ష ప్రకటించినందుకు పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. నాయీబ్రాహ్మణులు పోచం, నాగరాజు, మధునయ్య, రాజు, బీఆర్‌ఎస్ నాయకులు నాయిని సతీశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఓటర్ల జాబితాలో అవకతవకలు లేకుండా చూడాలి
మందమర్రిరూరల్: ఓటరు జాబితాలో అవకతవకలు లేకుండా చూడాలని చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీరాములు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకుల, బీఎల్‌వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ రెండుచోట్ల ఒకరి పేరిట ఓటరు నమోదు లేకుండా చూసుకోవాలన్నారు. ఆర్డీవో వేణు, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గని ప్రమాద మృతుడికి మ్యాచింగ్ గ్రాంట్ అందజేత
శ్రీరాంపూర్: ఎస్సార్పీ 1 గని ప్రమాదంలో మృతిచెందిన బండారి రాయలింగు కుటుంబానికి కంపెనీ మ్యాచింగ్ గ్రాంట్ అందజేసింది. జీఎం కార్యాలయం వద్ద జీఎం సంజీవరెడ్డి శుక్రవారం మృతుడి భార్య భాగ్యలక్ష్మికి రూ.10,23,000ల చెక్కు, మరో రూ.10 లక్షల బాండ్‌ను అందించారు.

బాధితులకు పరామర్శ
భీమిని: వీగాంలో గాలిదుమారం వల్ల ఇళ్లు కూలాయి. బాధితులను బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎంపీటీసీ మహేందర్, శారద పరామర్శించారు. బెల్లంపల్లి టౌన్ మహిళా ప్రెసిడెంట్ సరోజ, శారద, యూత్ కాంగ్రెస్ నాయకుడు బోగ శ్రవణ్ ఉన్నారు.

ఉచిత ఆయుర్వేద శిబిరం
శ్రీరాంపూర్: ఆర్కే 6 కొత్తరోడ్‌లో ఉచిత ఆయుర్వేద శిబిరం ఏర్పాటు చేశారు. 103 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కౌన్సిలర్ ఆయూస్, మెడికల్ ఆఫీసర్ పద్మజ ఉన్నారు.

అంబలి పంపిణీ ప్రారంభం
లక్సెట్టిపేట: పుస్కూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూరి రాంమోహన్‌రావు ఆదేశాలతో ఆయన అనుచరులు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అంబలి పంపిణీ, చలివేంద్రాన్ని ప్రారంభించారు. తిరుపతి, నారాయణ, చంద్రమౌళి, సుధాకర్, వేణుగోపాల్, సత్తన్న ఉన్నారు.

సీఐటీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ
రామకృష్ణాపూర్: పెద్దపల్లి గోదావరిఖనిలోని రెడ్డీస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. వెంకటస్వామి, రామస్వామి, ఐలయ్య, సంజీవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో వసతులు కరువు
మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మౌలిక వసతులు కరువయ్యాయని టీడీపీ చెన్నూర్ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఐటీఐని సందర్శించి వసతులను పరిశీలించారు. మరుదుదొడ్డి అపరిశుభ్రంగా ఉందని స్కావెంజర్ లేరన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ టవర్ తొలగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీవాసులు



తొలగిస్తున్న విద్యుత్ టవర్

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని కాలేజీరోడ్డులో గల ప్రభుత్వ మెడికల్ కాలేజీ రోడ్డు పక్కన ఇటీవల వేసిన 33 కేవీ విద్యుత్ టవర్ తొలగించాలని కాలనీవాసులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పక్కనే టవర్ వేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఆందోళనకు దిగినట్లు తెలిపారు. స్పందించిన అధికారులు టవర్‌ను తొలగించారు.